క్లుప్తంగా

వెస్ట్ క్రైం సీఐ బాధ్యతల స్వీకరణ


విధుల్లో క్రైం సీఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం: వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐగా ఎన్.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన సంతకం పెట్టి విధుల్లో చేరారు. గతంలో త్రీటౌన్ క్రైం ఎస్‌ఐగా, విజయనగరం, పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేరాల నియంత్రణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

మర్రిపాలెం: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, వారి సొమ్మును దోచుకున్న ద్రోహి టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల బీసీ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తుళ్లి చంద్రశేఖర్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినట్టు బీసీలకు కూడా ద్రోహం చేసిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. జయహో బీసీ సభలో బీసీల మీద కపట ప్రేమ చూపిస్తూ చేతకాని హామీలను ఇస్తూ మోసం చేయడానికి సిద్ధపడ్డారన్నారు. ఆయన హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని, దోబీఘాట్లు కట్టడంలో, బీసీ పనిముట్ల కొనుగోలులో, ఆదరణ పథకంలో, భవనాలు కట్టిస్తానంటూ పలు స్కాంలకు పాల్పడి బీసీ నిధులని దోచుకుని.. దాచుకుని.. పంచుకున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు అండ్ కంపెనీ కాదా అని ప్రశ్నించారు. బీసీల కోసం మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని తుళ్లి చంద్రశేఖర్ చెప్పారు.

హాస్య నాటిక ప్రదర్శన రేపు

మురళీనగర్: కళల ప్రోత్సాహంలో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఈ నెల 7న హాస్య నాటిక ప్రదర్శించనున్నట్లు పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 7 గంటలకు ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటికను మాధవధార శ్రీచైతన్య కళాసాగర్ నటులు ప్రదర్శిస్తారన్నారు. జంధ్యాల రచించిన ఈ హాస్య నాటికకు సనపల సన్యాసయ్య దర్శకత్వం, ఎల్వీ రమణ పర్యవేక్షణ వహిస్తారని చెప్పారు. ఎస్.సన్యాసయ్య, ఎస్.రామానుజయ్య, పి.గిరిధర్, ఎ.కొండలరావు, ఎస్.హరిబాబు, ఎస్.సత్యనారాయణ నటిస్తారని, సత్యనారాయణమూర్తి సంగీతం అందిస్తారన్నారు.

రేపు అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ మహాజన సభ

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ, త్రిఫ్ట్ డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.

గోస్తనిలో జారి పడి వ్యక్తి మృతి


రాము మృతదేహం

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ సామయ్య వలస వద్ద శుక్రవారం గోస్తనిలో కాలు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా.. సామయ్యవలస చెందిన సేనాపతి రాము(34) మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గోస్తని నదిలో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి నదిలో పడి మరణించాడు. రాము భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పింఛన్.. ఆనందం పంచెన్


25వ వార్డు గొల్లవీధిలో పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్


43వ వార్డు నందగిరినగర్‌లో రూ.3 వేల పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులతో కార్పొరేటర్ ఉషశ్రీ

- రూ.3 వేల పెన్షన్ల అందజేత
- సీఎం జగన్‌కు లబ్ధిదారుల కృతజ్ఞతలు

సీతంపేట: ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచారు. అది అందుకున్న లబ్ధిదారులంతా మురిసిపోతూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు.

జీవీఎంసీ 25వ వార్డులోని 130, 131, 132, 133, 134 సచివాలయాల పరిధిలో శుక్రవారం రూ.3 వేల పెన్షన్‌ను పంపిణీ చేశారు. కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో 1,379 మంది వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారని, మళ్లీ అర్హులైన మరి కొంత మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. పింఛన్ సొమ్ము పెంపుతో లబ్ధిదారులకు మరింత ఆర్థిక భరోసా చేకూరిందని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మద్దతు తెలపాలని గోవింద్ కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సారిపల్లి సంతోష్, పోతిబంతి హరికృష్ణ, పద్మ, వీరమ్మ, జయ, రత్నం, బొమ్మాళి రవి, వానపల్లి లక్ష్మణకుమార్, చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ సన్నీ, సచివాలయ, అడ్మిన్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుతో ఆర్థిక భరోసా

జీవీఎంసీ 43వ వార్డు 241, 244, 249 సచివాలయాల పరిధిలోని నందగిరినగర్, రైల్వే న్యూకాలనీ జంక్షన్ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ వలంటీర్లతో కలిసి వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలవారీ పెన్షన్ సొమ్ము రూ.3 వేలకు పెంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలపై నిజమైన ప్రేమ ఉన్న నాయకుడు ఆయనే అని కొనియాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఎవరి దయా దాక్షిణ్యాలపై ఆధారపడకుండా వారి ఖర్చులకు ఎవరి వద్ద చెయ్యి చాచకుండా రూ.3 వేలు పెన్షన్ అందిస్తున్నారని చెప్పారు. పెరిగిన పెన్షన్ సొమ్ముతో లబ్ధిదారుల్లో ఆత్మవిశ్వాసం పెంచారన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



మూడేళ్లుగా వితంతు పింఛన్ అందుకుంటున్నాను. పిల్లలను చదివించడానికి, ఇల్లు గడవడానికి పెన్షన్ డబ్బులు ఉపయోగపడుతున్నాయి. గత ప్రభుత్వం కంటే జగనన్న పాలన బాగుంది. మళ్లీ ఆయనే సీఎం కావాలి. కార్పొరేటర్ గోవింద్, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి రూ.3 వేల పింఛన్ సొమ్ము అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– నమ్మి రాజేశ్వరి, గొల్లవీధి, సీతంపేట

జగన్ బాబు మేలు మర్చిపోను



పదేళ్లుగా వితంతు పింఛన్ అందుకుంటున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నపుడు పింఛన్ డబ్బుల కోసం వార్డు ఆఫీసు వద్ద పడిగాపులు కాసే దాన్ని. జగన్ బాబు వచ్చాక మాకు ఆ బాధలు తప్పాయి. ప్రతి నెలా 1న వలంటీర్ ఇంటికి వచ్చి చేతిలో పింఛన్ సొమ్ము పెడుతున్నారు. ఈ రోజు రూ.3 వేలు అందజేశారు. జగన్ బాబు చేసిన మేలు మర్చిపోను.

– ఎస్. దాలెమ్మ, గొల్లవీధి, సీతంపేట

ప్రతిష్టాత్మకంగా 'బస్సు యాత్ర'


కైలాసపురం పోర్టు హాస్పిటల్ వద్ద ఇనార్బిట్ మాల్ రోడ్డులో చేసిన భారీ ఏర్పాట్లు

- విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు

మర్రిపాలెం: ఈ నెల 6న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. 50వ వార్డు మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని పార్కుల్లో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వాకర్స్, ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలతో మాట్లాడారు. కైలాసపురం పోర్టు హాస్పిటల్ వద్ద గల ఇనార్బిట్ మాల్ రోడ్డులో శనివారం బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వాకర్స్, పలు సంఘాల పెద్దలను కలిసి కార్యక్రమ కరపత్రాలను అందించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజనీఈశ్వర్‌రావు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టర్, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసిన లక్ష్మి, బీసీ డైరెక్టర్ నూకరాజు, ఏపీఎస్ రాజు, బగాది విజయ్, నీలి రవి, ఎం.సునీల్, ఐ.రవికుమార్, చిరంజీవి, సీపాన రాము, కర్రి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

ముస్లింలు భారీగా తరలిరండి

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో శనివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చెయ్యాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ.హెచ్.ఫారూఖీ పిలుపునిచ్చారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వద్ద గల తన కార్యాలయంలో శుక్రవారం ముస్లిం మత పెద్దలు, నాయకులతో సమావేశమయ్యారు.


ముస్లిం నాయకులతో సమావేశమైన ఐ.హెచ్.ఫారూఖీ

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం నుంచి జరగనున్న బస్సు యాత్ర, బైక్ ర్యాలీ, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కైలాసపురం రోడ్‌లోని ఇనార్బిట్ మాల్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, ముస్లిం నాయకులు ఎం.డి.మక్బూల్, ఎం.ముస్తఫా, హబీబ్, గౌస్, నవాబ్, తాజుద్దీన్ బాబా, ఉమర్, ఆశిక్, ఖాజా, వై.ఎం.ఖాన్, జఫ్రుల్లాఖాన్, బాషా, అయూబ్, ముర్తజు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యా విధానం అద్భుతం


బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి


విద్యార్థుల ప్రార్థనా గీతంలో పాల్గొన్న విదేశీయులు

- విదేశీ ప్రతినిధుల ప్రసంశలు
- బాలభాను విద్యాలయం సందర్శన

మురళీనగర్: భారతీయ విద్యా విధానం చాలా బాగుందని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. మురళీనగర్ సెక్టార్–8లోని బాలభాను విద్యాలయాన్ని శుక్రవారం వీరు సందర్శించారు. గురుపూజ మహోత్సవంలో పాల్గొనడానికి స్విట్జర్లాండ్, స్పెయిన్, అమెరికా దేశాల నుంచి పలువురు విదేశీ ప్రతినిధులు విశాఖ చేరుకున్న సందర్భంగా ఈ విద్యాలయాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశంలో విలువలతో కూడిన విద్యతోపాటు భారతీయ సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూనే ప్రపంచీకరణకు అనుగుణంగా విద్యా బోధన జరుగుతోందని వారు కితాబిచ్చారు. తరగతుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. భారతీయ సంప్రదాయాలపై ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. బోధనాభ్యసన విధానంలో టెక్నాలజీ వాడుతున్న విధానాన్ని వారు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. భారతదేశాన్ని ముఖ్యంగా విశాఖను సందర్శించడం తాము గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ కేపీఎస్ గురు ప్రసాద్‌తోపాటు స్విట్జర్లాండ్ నుంచి లేట్జర్ ఫిలిప్స్, సబీన అన్లికర్, స్పెయిన్ నుంచి డాక్టర్ మైక్వెల్ సమ్మర్ర, డాక్టర్ జోసా సరోసాల్, జోనాస్, ఫెర్నాండో ఓసోరియా, మోర్తా గోర్ డాన్స్, అమెరికా నుంచి మార్క్ రే పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం డైరెక్టర్ పి.రవిశంకర్, పి.సందీప్, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.వి.శుభశ్రీ, టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణారావు పాల్గొన్నారు.

ఓబీసీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ఓబీసీ ఉద్యోగుల సంక్షేమం, వాటి అమలు, ఇతర సమస్యలపై శుక్రవారం భువనేశ్వర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజేష్‌వర్మ, 30 మంది ఎంపీలు, కమిటీ సభ్యులు న్యూఢిల్లీ నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే హెడ్ క్వార్టర్స్ భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించారని చెప్పారు. ఓబీసీ కార్మికులు, నాయకులపై కక్ష సాధింపు చర్యలను అధికారులు, యాజమాన్యం విడనాడేలా తగిన సూచనలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఓబీసీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారికి వినతిపత్రం అందించామని రాజశేఖర్ తెలిపారు. నిర్వాహక అధ్యక్షులు రామచంద్రరావు, బి.కె. సాహూ, శివప్రసాద్, జి.శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్‌లో పాల్గొనాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.

అందరి సహకారంతో ధరిత్రి పరిరక్షణ

మురళీనగర్: ధరిత్రి పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పరాగ్ మైతి అన్నారు. ధరిత్రి పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర చేస్తున్న కోల్‌కతా యువకుడు పరాగ్ మైతి శుక్రవారం మురళీనగర్‌లో మిద్దె తోటల పెంపకందారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత విశాఖ సాధించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మిద్దె పంటలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. తాను ఇంత వరకు నాలుగు రాష్ట్రాల్లో నాలుగు వేల కిలోమీటర్లు సైక్లింగ్ చేశానని.. ఇంకా వెయ్యి కిలోమీటర్ల యాత్ర నిర్వహించిన అనంతరం కోల్‌కతా చేరుకుంటానన్నారు. గ్రీన్ క్లైమేట్ బృందం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.


సైకిల్ యాత్రికుడు పరాగ్ మైతితో మిద్దెతోట పెంపకందారులు

44వ వార్డులో సంక్రాంతి సంబరాలు

సీతంపేట: జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం షాదీఖానాలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతుల మీదుగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆర్పీలకు ప్రెజర్ కుక్కర్లు సంక్రాంతి కానుకగా అందజేశారు. సుమారు 270 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందజేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీకి మద్దతు తెలిపేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆర్పీలు కృషి చేయాలని కోరారు. బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డు స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలు, సేవలు ప్రజలకు చేరువ చేయడంలో నిత్యం శ్రమిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆర్పీలను గౌరవించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గోపి, హీరా, శ్యామల, ప్రకాష్, బాధా శ్రీను, కాయల రామారావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


సంక్రాంతి కానుకగా కుక్కర్ అందజేస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు


క్విజ్ పోటీల విజేతలతో బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఫైనల్స్ నిర్వహించారు. ప్రథమ, తృతీయ బహుమతులను ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు, ద్వితీయ బహుమతిని ఎ.ఎస్.రాజా జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలను అందించారు. కార్యక్రమంలో పాత్రా కంపెనీ ఎండీ లక్ష్మి ముఖవల్లి, కళాశాల ప్రిన్సిపాళ్లు, డీన్లు, కో ఆర్డినేటర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

దాబాగార్డెన్స్: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 6న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం వార్షికోత్సవ పోస్టర్‌ను కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ యమునా తీరం సంధ్యారాగం పేరిట నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో తెలుగు, హిందీ చలన చిత్రాల్లోని పలు గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించనున్నారని చెప్పారు. సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

సీతమ్మధార: రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా.. కొందరు వాహన చోదకుల తీరు మారడం లేదు. యథేచ్ఛగా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ.. రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకున్నారు. ఇతర వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ప్రధాన రహదారిలో ఈ పరిస్థితి నిత్యం కనిపిస్తోంది. నక్కవానిపాలెం నుంచి కేఎస్ఆర్ కాంప్లెక్స్ రోడ్డుకు వెళ్లే వాహనాలు, సీతమ్మధార రైతుబజార్ నుంచి వచ్చిన వాహనాలు నక్కవానిపాలెం రోడ్డు మీదుగా సత్యం జంక్షన్ వైపు వెళ్తుంటాయి. అటు వైపు వచ్చిన వాహనాలు.. రాంగ్ రూట్‌లో వచ్చిన వాహనాలు ఎదురెదురుగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు జాడ కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని వారు కోరుతున్నారు.


నక్కవానిపాలెం రోడ్డులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వాహన చోదకులు

8 నుంచి శిల్పారామంలో సంక్రాంతి పోటీలు

మధురవాడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మధురవాడ శిల్పారామం జాతరలో జనవరి 8, 9,10 తేదీల్లో పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు శిల్పారామ అధికారి విశ్వనాథరెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా 8వ తేదీన సాయంత్రం 3గంటలు నుంచి 5గంటలు వరకు గాలిపటాలు పోటీలు, 9వ తేదీన సాయంత్రం 5గంటలు నుంచి 6గంటలు వరకు 10 ఏళ్ల లోపు పిల్లలకు సంప్రదాయ వస్త్రధారణ, 10వ తేదీ మధ్యాహ్నం 2గంటలు నుంచి 4గంటలు వరకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తారు. ముగ్గులు పోటీలకు కావలసిన సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. 13,14, 15,16 తేదీల్లో సాయంత్రం మధురవాడకు చెందిన ప్రైవేటు పాఠశాల విజయం సౌజన్యంతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన దలచిన వారు 96526 28100, 63090 29591లలో సంప్రదించాలని విశ్వనాథరెడ్డి కోరారు.

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

దాబాగార్డెన్స్: స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడు, 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి, టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్ఎంసీలు ఆదినారాయణ, ఎన్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతోపాటు ఔట్ గేటు వద్ద వీరంతా బైఠాయించి వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు కార్మికులంటే యాజమాన్యానికి చిన్నచూపు తగదన్నారు. యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.